## ఎంపీఈడీ పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంపీఈడీ పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీఈడీ నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, మూడు, నాలుగో సెమిస్టర్ల బ్యాక్ లాగ్ పరీక్షలను ఈ నెల 6వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవాలని సూచించారు.

## హోటల్ మేనేజ్‌మెంట్ డిగ్రీ రీవాల్యుయేషన్ ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని హోటల్ మేనేజ్‌మెంట్ డిగ్రీ (బీహెచ్ఎంసీటీ, బీసీటీసీఏ) కోర్సుల పరీక్ష రీవాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుల సెమిస్టర్ పరీక్షల రీవాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవాలని సూచించారు.

## డిగ్రీ కోర్సుల పరీక్ష ఫీజు స్వీకరణ గడువు పొడిగింపు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కోర్సుల పరీక్ష ఫీజు స్వీకరణ గడువును పొడిగించినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ, బీఎస్సీ ఆనర్స్, బీబీఏ, బీఎస్‌డబ్ల్యూ అన్ని కోర్సుల రెండో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫీజును ఈ నెల 8వ తేదీ లోపు సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.500 అపరాధ రుసుముతో 14వ తేదీ వరకు చెల్లించవచ్చని పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే ప్రకటిస్తామని స్పష్టం చేశారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని సూచించారు.

# సంఘటిత శక్తికి ప్రతీక మే డే

● ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, తలసాని



మే డే వేడుకల్లో జెండా ఎగురవేసిన అనంతరం కార్మికులతో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

కవాడిగూడ, మే 1: శ్రమజీవుల సంఘటిత శక్తికి ప్రతీక మేడే అని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మేడేను గురువారం నిర్వహించారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్ ముఖ్యఅతిథిగా హాజరై జీహెచ్ఎంసీ కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రమను నమ్ముకుని జీవనం సాగించే కార్మికులను గౌరవించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బింగి నవీన్, రహీం, మహ్మద్‌అలీ, ముచ్చకుర్తి ప్రభాకర్, చాంద్‌పాషా, శంకర్‌గౌడ్, సాయి, మక్బూల్, కల్యాణ్, ప్రవీణ్‌రాజు, శ్రీనివాస్ యాదవ్, కృష్ణ, శివముదిరాజ్, శంకర్, మహేష్ పాల్గొన్నారు.

మారేడ్‌పల్లి: ప్రపంచంలోని కార్మికుల పండుగ మేడే అని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. మోండా డివిజన్‌లోని ఓల్డ్ జైల్‌ఖాన వద్ద నిర్వహించిన వేడుకల్లో జెండాను ఎగురవేశారు. ఆయన మాట్లాడుతూ శ్రమకు మారుపేరు కార్మికులు అని చెప్పారు. కార్యక్రమంలో మోండా డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఆకుల హరికృష్ణ, నాయకులు జయరాజ్, మహేందర్, కార్మిక సంఘం నాయకులు వెంకటేష్, సంజీవ, దశరథ్, శివ, గోవర్ధన్ పాల్గొన్నారు.

**ముషీరాబాద్:** మే డే సందర్భంగా విద్యానగర్ అచ్యుతరెడ్డి మార్గంలో గురువారం పరిశుధ్య కార్మికులకు చీరల పంపిణీ జరిగింది. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ముఠా గోపాల్ పాల్గొని చీరలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేని అని అన్నారు. వారికి చేతనందించడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకురాలు ప్రేమలతరెడ్డి, భాగ్యమ్మ, మంగమ్మ, స్నేహలత, స్వర్ణలత, ప్రియాంక, కవిత, విజయ, అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షుడు బల్ల శ్రీనివాస్‌రెడ్డి, నేత శ్రీను, మాధవ్, శ్యాంసుందర్, టైలర్ శీను, అస్లాం, యూనిస్, రామస్వామి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

**బన్సీలాల్‌పేట్:** న్యూబోయిగూడలోని కేటీఆర్ పార్కు ఆటో స్టాండ్ మే డే సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు ఓరుగంటి రాజు జెండాను ఎగురవేశారు. ఆటో డ్రైవర్లు, కార్మికులకు బీఆర్ఎస్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన అన్నారు. బీఆర్ ఎస్ నాయకులు ఎస్.రాజేందర్, కె.దేవేందర్, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో జరిగిన మే డేలో భాగంగా కార్మిక నాయకులు టి.గంగాధర్, రామోజీ నర్సింగ్‌రావు, వెంకట్రావులను ఘనంగా సన్మానించారు. మహాసభ నాయకులు సదానంద్, వెంకటేశ్వర్, నరేష్, శ్రీకాంత్, సురేందర్, రాజారాం పాల్గొన్నారు.

హమాలీబస్తీ ఫేజ్ 2 సెంటర్ కమ్యూనిటీ హాల్ వద్ద జరిగిన మే డే ఉత్సవాలలో సీపీఎం నగర కార్యవర్గ సభ్యులు ఎం.శ్రీనివాస్‌రావు హాజరై జెండాను ఆవిష్కరించారు. అనంతరం మెయిన్ రోడ్డు పక్కన దర్గా ముందు బస్తీ నాయకుడు శివప్ప, పద్మారావునగర్ ఆటో స్టాండ్ దగ్గర ఎం.యాదగిరి జెండాలను ఎగుర వేశారు. కార్యక్రమములో శుభాష్, రవి, హరి, బస్వారాజు, నర్సింగ్, శివప్ప, యాదగిరి, హనుమంతు, శ్యామ్ ,చెందర్, విజయ్, శ్రీను, ఆటో హరి, అశోక్ పాల్గొన్నారు

**చిక్కడపల్లి:** వీఎస్టీ కార్మికులకు త్వరలో కంపెనీ షిఫ్టింగ్ బెనిఫిట్స్ హామీలు త్వరలో అమలు చేస్తామని మాజీ ఎంపీ, వీఎస్టీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు జి.సంజీవరెడ్డి అన్నారు. గురువారం బాగ్‌లింగంపల్లిలోని వీఎస్టీ యూనియన్ కార్యాలయంలో మే డే నిర్వహించారు. యూనియన్ సలహదారు ఆర్డీ చంద్రశేఖర్, కె.రాజు, ప్రధాన కార్యదర్శి ఎల్డీ పాల్, చీఫ్ ఉపాధ్యకుడు జి.నాగేష్, కోశాధికారి కృష్ణారెడ్డి, డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఏఆర్ శ్రీనివాసయాదవ్, నాయకులు ప్రభాకర్, విజయేందర్, వెంకటరెడ్డి, రణవీర్‌రెడ్డి, సమద్, రామ్మోహన్, సాయిప్రసాద్ తదితనులు పాల్గొన్నారు.

**బొల్లారం:** బోయిన్‌పల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మే డే వేడుకలు నిర్వహించారు. ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ కార్మికులు, నాయకులతో కలిసి మేడే జెండా ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో యజమానులకు అనుకూలంగా ఉండే కోడ్ పద్ధతిని తీసుకొచ్చిందని వివరించారు. వాటికి వ్యతిరేకంగా ఈ నెల 20న దేశవ్యాప్తంగా కార్మిక వర్గం సమ్మెకు పిలుపునివ్వడం మోడీ ప్రభుత్వానికి చెంపపెట్టు అని పేర్కొన్నారు. కార్యక్రమంలో బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన్న ప్రతాప్, చైర్మన్ ఆనంద్‌బాబు, వైస్ చైర్మన్ డీబీ దేవేందర్, హమాలీ యూనియన్ నాయకులు ఎల్లయ్య, వెంకటస్వామి, ధనుంజయ్, నాగరాజు, ప్రసాద్, శేఖర్, నరేష్ పాల్గొన్నారు

**ఉస్మానియా యూనివర్సిటీ:** టీయూసీఐ అనుబంధ ప్రోగ్రెసివ్ కాంట్రాక్ట్ అండ్ క్యాజువల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షురాలు ఎస్ఎల్ పద్మ ఓయూ లేడీస్ హాస్టల్ ఎదురుగా జెండాను ఎగురవేశారు. కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఓయూ అధ్యక్షుడు మహేందర్ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో జెండా ఎగురవేశారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన మనువాద బీజేపీ ప్రభుత్వం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను తుంగలో తొక్కి కార్మికులను బానిసలుగా మార్చే ప్రమాదకర లేబర్ కోడ్‌లు తీసుకొస్తున్నారని మండిపడ్డారు. ఎనిమిది గంటల పనిని తీసేసి 12 గంటలు అమల్లోకి తీసుకురావాలని కుట్రలు పన్నుతున్నారని అనుమానం వ్యక్తం చేశారు. ఓయూలో నాలుగేండ్ల నుంచి వేతనాలు పెంచకుండా కార్మికుల్ని కట్టు బానిసలుగా పని చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే సమాన పనికి సమాన వేతనం, కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.




హమాలీ బస్తీలో జెండా ఎగరవేసిన సీపీఎం నగర కార్యవర్గ సభ్యుడు శ్రీనివాసరావు




ఓయూ లేడీస్ హాస్టల్ ఎదుట జెండా ఎగురవేస్తున్న ప్రోగ్రెసివ్ కాంట్రాక్ట్ అండ్ క్యాజువల్ వర్కర్స్ యూనియన్ నాయకులు



మేడే సందర్భంగా మున్సిపల్ కార్మికులకు చీరలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే ముఠా గోపాల్

## అర్హులందరికీ సీఎం రిలీఫ్ ఫండ్



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

చిక్కడపల్లి, మే 1: దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నామని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. గాంధీనగర్ డివిజన్లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం దరఖాస్తు చేసుకున్న సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన 20 మంది లబ్ధిదారుల రూ.6,49,500 విలువైన చెక్కులను అందజేశారు. గాంధీనగర్, కవాడిగూడ, అడిక్మెట్, రాంనగర్ డివిజన్ల బీఆర్ఎస్ అధ్యక్షులు రాకేష్‌కుమార్, వల్లల శ్యామ్‌యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, శంకర్‌ముదిరాజ్, నాయకులు సీనియర్ బీఆర్ఎస్ నాయకులు, ముఠా నరేష్, మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, ఆకుల అరుణ్‌కుమార్, ఎర్రం శ్రీనివాస్ గుప్తా, ముదిగొండ మురళి, పూన్న సత్యనారాయణ, ఖలీల్, శ్రీహరి, కుమారస్వామి, నర్సింగ్, యాదగిరి, సునీల్ పాల్గొన్నారు.

## సాహిత్య చరిత్రలో అత్యుత్తమం మహాప్రస్థానం



సభలో మాట్లాడుతున్న పద్మశ్రీ కొలకలూరి ఇనాక్

ముషీరాబాద్, మే 1: సామ్యవాద భావన, ఆలోచనలతో నిండిన మహాకవి శ్రీశ్రీ మహాప్రస్థానం ప్రపంచ సాహిత్య చరిత్రలోనే అత్యుత్తమ మహా కావ్యమని పద్మశ్రీ, ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. త్యాగరాయ గానసభలో ఎందరో మహానుభావులు కార్యక్రమం లో భాగంగా శ్రీశ్రీ సంస్మరణ సభ జరిగింది. ముఖ్యఅతిథిగా ఆచార్య ఇనాక్ హాజరై మాట్లాడుతూ శ్రీశ్రీ విప్లవ సాహిత్య యుగకర్త అన్నారు. ఆయన కవిత్వం చదివి సమాజ అసమానతలపై ఉద్యమించిన వారు కొందరైతే, ఎందరో అయన పంథాను అందిపుచ్చుకొని కవితా రచన చేపట్టారని గుర్తుచేశారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో గాయకుడు శ్రీధర సుబ్రహ్మణ్యం, గానసభ పాలకవర్గ సభ్యురాలు గుండవరపు గీత తదితరులు పాల్గొన్నారు.


## కుల గణనకు విధి, విధానాలు ప్రకటించాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న స్వామిగౌడ్

ఉస్మానియా యూనివర్సిటీ: కులగణన చేయనున్నట్లు ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం తక్షణమే విధివిధానాలను ఖరారు చేయాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు బొల్లెపల్లి స్వామిగౌడ్ డిమాండ్ చేశారు. ఆర్ట్స్ కళాశాల ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీ మేధావులు, ప్రజాసంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశాలు ఏర్పాటు చేసి వారి సూచనలను తీసుకోవాలని కోరారు. కులాలవారీగా, ఉపకులాల వారీగా లెక్కించాలని అన్నారు. విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాల్లో బీసీల వాటా దక్కాలంటే చిత్తశుద్ధితో కులగణన చేయాలన్నారు. విద్యార్థి నేతలు సురేష్, లింగాల మహేష్, శ్రీకాంత్, పండరి, అంజి, రాజు పాల్గొన్నారు.

## బీఎంఈయూ అధ్యక్షుడిగా కె.ప్రకాష్ ఎన్నిక



బీఎంఈయూ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన కె.ప్రకాష్‌ను సన్మానిస్తున్న నాయకులు

బన్సీలాల్‌పేట్: జీహెచ్ఎంసీలో గుర్తింపు కలిగిన భాగ్యనగర్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడిగా కాశపాగా ప్రకాష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నాయకులు అష్రాఫ్‌అలీ, శ్రీధర్‌గౌడ్, మోహన్‌దాస్, సత్యరాజ్, యాదగిరి, గోపాలకృష్ణ, నర్సింగ్‌రావు, రవి ప్రకాష్‌ను ఘనంగా సన్మానించి, అభినందనలు తెలిపారు.

## యోగాతోనే మెరుగైన ఆరోగ్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న తేళ్ల బాల్‌రాజ్

ఉస్మానియా యూనివర్సిటీ: యోగాను నిరంతరం సాధన చేయడం ద్వారా మెరుగైన ఆరోగ్యం పొందవచ్చని ఆయుర్ ఆరోగ్య రహస్య మెడిటేషన్ యోగా (ఏఏఆర్ఎంవై) రీసర్చ్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు తేళ్ల బాల్‌రాజ్ అన్నారు. ప్రతిఒక్కరూ చెడు వ్యసనాలకు దూరంగా ఉండి యోగా చేయడం అలవర్చుకోవాలని సూచించారు. మేడిబాయి ఆర్య సమాజ్‌లో ఏఏఆర్ఎంవై ఆవిర్భావ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వీధి వీధికీ, వాడవాడకీ యోగా గురించి ప్రజలకు అవగాహన కల్పించడం ఎంతో ముఖ్యమని అన్నారు. ఆ దిశగా తాము కృషి చేయనున్నట్లు తెలిపారు. ఆర్య సమాజ్ ప్రాంగణంలో ఉదయం 5.30 నుంచి రెండు గంటల పాటు ప్రతిరోజు ఉచిత యోగా శిక్షణ అందజేస్తున్నట్లు చెప్పారు. దాదాపు 60 ఏళ్ల నుంచి ఇది కొనసాగుతోందని పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దీంతోపాటు తమ సంస్థ తరపున యోగా టీచర్ ట్రైనింగ్ కూడా అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఏఆర్ఎంవై ప్రతినిధులు కస్టమ్స్ మాజీ కమిషనర్ మంగబాబు, సహజ డెవలపర్స్ డైరెక్టర్ ప్రసన్న, డాక్టర్ రామకోటేశ్వర రావు (ఆర్కే చౌదరి) తదితరులు పాల్గొన్నారు.

## దంత వైద్యుడి ఆత్మహత్య

బేగంపేట్, మే 1: మానసిక సమస్యలతో ఓ దంత వైద్యుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం రాత్రి బేగంపేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన సంఘటన వివరాలు ఇన్‌స్పెక్టర్ ప్రసాదరావు తెలిపారు. మల్లంపేటకు చెందిన కొమ్ము మహర్షి(30) దంత వైద్యుడు. కొంత కాలంగా బైపోలార్ డిజాస్టర్ సమస్యతో బాధ పడుతున్నాడు. తరచుగా తాను చనిపోవాలి అన్నట్లుగా చెబుతుండే వారు. బేగంపేట్ బ్రాహ్మణవాడిలో ఉన్న సోదరుడికి ఫోన్ చేసి తాను చనిపోతానని చెప్పారు. దీంతో మహర్షిని తన సోదరుడి ఇంటికి తీసుకువచ్చారు. సోదరుడు బయటకు వెళ్లిన సమయంలో మహర్షి ఇంట్లో సీలింగ్ ఫ్యాన్కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సోదరుడు ఇంటికి వచ్చి చూడగా గది తలుపులు మూసి ఉన్నాయి. ఎంత ప్రయత్నించినా తీయకపోవడంతో బలంగా తలుపులు తీయగా మహర్షి ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. దీంతో పోలీసులకు సమాచారం ఇవ్వండంతో మహర్షి మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

### చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి

బొల్లారం, మే 1: అస్మారక స్థితిలో పడి ఉన్న గుర్తుతెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన బోయిన్పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై శివశంకర్ తెలిపిన వివరాల ప్రకారం న్యూబోయిన్పల్లి చౌరస్తా పెట్రోల్ బంక్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి (50) అపస్మారక స్థితిలో పడిఉన్నాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడని వైద్యులు ధ్రువీకరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

### ద్విచక్రవాహనం అదుపుతప్పి..

ద్విచక్ర వాహనం అదుపుతప్పి తలకు గాయాలై చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై శివశంకర్ వివరాల ప్రకారం ఏప్రిల్ 30న బాపూజీ నగర్‌కు చెందిన వి.భాస్కరాచారి (40) స్వర్ణకారుడు. బోయిన్‌పల్లి చౌరస్తా వద్ద ద్విచక్ర వాహనంపై అదుపుతప్పి కింద పడిపోయాడు. స్థానికులు తండ్రి రాఘవాచారికి సమాచారమిచ్చారు. తలకు చిన్న గాయమే అనుకొని ఇంటికి తీసుకువెళ్లారు. తెల్లవారుజామున అపస్మారకస్థితిలో ఉండటాన్ని గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం గాంధీ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందడాని వైద్యులు ధ్రువీకరించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## కార్మికుల హక్కుల సాధన కోసం బీఆర్ఎస్ పోరాటం



బీఆర్టీయూ జెండా ఆవిష్కరిస్తున్న మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి, గజ్జెల నాగేష్ తదితరులు

బొల్లారం: కార్మికుల హక్కుల సాధనకై బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం బోయినపల్లిలో భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ సీనియర్ నేత రాగిడి లక్ష్మారెడ్డి, రాష్ట్ర బేవరేజస్ కార్పోరేషన్ మాజీ చైర్మన్ గజ్జెల నాగేష్, కార్మిక సంఘం అధ్యక్షుడు శంభు ప్రభాకర్, కార్మికులతో కలిసి బీఆర్టీయూ జెండా ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రమించే వాడు కార్మికుడు, కర్మాగారాల్లో పనిచేసే వారే కార్మికులని కొనియాడారు. ఆశ, అంగన్వాడీలు ఎన్నో కష్టాలు ఎదుర్కొంటున్నారని, కాంట్రాక్ట్ లేబర్స్ వేతనాల్లో జీఎస్టీ పేరుతో జీతాలు తగ్గిస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శంభు ప్రభాకర్, కార్మిక నాయకులు రవి, చారి, సురేష్, సంతోష్, సిరాజుద్దీన్, బీఆర్ఎస్ నాయకులు అమీనుద్దీన్, రమేష్, శివకుమార్, భాగ్య, రావుల సతీష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## మే డే సందర్భంగా పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు నోట్ పుస్తకాలను అందజేస్తున్న కార్పొరేటర్ హేమ

**సికింద్రాబాద్, మే 1:** సీతాఫల్‌మండిలో సహాయ వేదిక ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత నోట్ పుస్తకాల పంపిణీ చేశారు. భాగ్యనగర్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సత్యంగౌడ్, జనరల్ సెక్రెటరీ చందు, సెక్రెటరీ కిరణ్ ఆధ్వర్యంలో మేడే వేడుకలు నిర్వహించారు. ఏసీపీ జైపాల్‌రెడ్డి, కార్పొరేటర్ హేమ, డాక్టర్ సంజీవరెడ్డి, సీఐ అనుదీప్, టీఆర్టీ కుమార్, మాదిగ హక్కుల దండోరా గౌరవ అధ్యక్షుడు సాయినాథ్ మాదిగ, భానుమతి, మాజీ కార్పొరేటర్ బండారి లత, హనుమంతుతో పాటు చిన్నారులు, టీచర్ అలివేలు తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు



ఎమ్మెల్యే పద్మారావుకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఆలయ చైర్మన్ దారబోయిన శ్రీనివాస్‌యాదవ్

అడ్డగుట్ట, మే 1: మెట్టుగూడలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో వందేండ్ల వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ దారబోయిన శ్రీనివాస్ యాదవ్ గురువారం తెలిపారు. నేటి నుంచి 4వ తేదీ వరకు విగ్రహ ప్రతిష్ఠాపన జరుగుతుందన్నారు. సికింద్రాబాద్, సనత్‌నగర్ ఎమ్మెల్యేలు పద్మారావుగౌడ్, తలసాని శ్రీనివాస్ యాదవ్, కార్పొరేటర్లు హాజరవుతారని అన్నారు. ఎమ్మెల్యే పద్మారావుగౌడ్‌ను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు.

## సనత్‌నగర్ నియోజకవర్గంలో భారీగా ఇన్‌స్పెక్టర్ల బదిలీలు

బేగంపేట్, మే 1: గతంలో ఎన్నడూ లేని విధంగా సనత్‌నగర్ నియోజకవర్గంలోని 13 మంది ఇన్‌స్పెక్టర్లు బదిలీఅయ్యారు. ఒకేసారి ఇంతమంది సీఐలు బదిలీ అయిన దాఖలాలు ఇప్పటి వరకు లేవు. గ్రేటర్‌లో చేపట్టిన బదిలీల్లో భాగంగా స్థాన చలనం కల్పించారు. బేగంపేట్ పోలీస్ స్టేషన్లో డీఐగా ఉన్న మధుసూదన్‌రెడ్డిని వారసిగూడ పోలీస్ స్టేషన్‌కు ఎస్‌హెచ్‌వోగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో మధురానగర్ పీఎస్‌లో ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రానున్నారు. బేగంపేట్ టీటీఐ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న రాంచందర్‌ను మార్కెట్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేశారు. ఆయన స్థానంలో టీటీఐ ఇన్‌స్పెక్టర్‌గా ట్రాఫిక్ అడ్మిన్‌గా ఆటాచ్‌లో ఉన్న అశోక్ నాగులకు బాధ్యతలు అప్పగించారు. మార్కెట్ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న రాఘవేంద్రను గుడిమల్కాపూర్ డీఐగా బదిలీ చేశారు. రాంగోపాల్‌పేట డీఐగా ఉన్న గోపిని చాంద్రాయణగుట్ట ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేశారు. ఆయన స్థానంలో సెక్రటరేట్ సెక్యూరిటీ వింగ్ నుంచి విక్రంసింగ్ రానున్నారు. గోపాలపురం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటరాములును లంగర్ హౌజ్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మారేడ్పల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్ రానున్నారు. బేగంపేట్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పాపయ్యను మీరాచౌక్ పోలీస్‌స్టేషన్ డీఐగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో ట్రాఫిక్ అడ్మిన్‌గా ఉన్న ఆకుల రమేష్ రానున్నారు. అలాగే సైదాబాద్ ఎస్‌హెచ్‌ఓగా ఉన్న రాఘవేందర్‌కు బేగంపేట్ ట్రాఫిక్ అడిషినల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యత అప్పగించారు. మహంకాళి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న ఉమాశంకర్‌ను డబీపురా పోలీస్ స్టేషన్ డీఐగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో బహదూర్‌పుర ఇన్‌స్పెక్టర్ రఘునాథ్ రానున్నారు. మహంకాళి పీఎస్ డీఐగా (గత యేడాది నుంచి సస్పెన్షన్) ఉన్న కేసరి ప్రసాద్‌ను అదే పోలీస్‌స్టేషన్లో డీఐగా బాధ్యతలు అప్పగించారు. గాంధీనగర్ డీఐగా ఉన్న అటాచ్‌లో ఉన్న పెండ్యాల జయశంవర్‌ను మార్కెట్ పోలీస్ స్టేషన్ డీఐగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో నాంపల్లిలో డీఐగా ఉన్న సైదేశ్వర్‌కు బాధ్యతలు అప్పగించారు. ఎస్సార్నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న సైదులును చార్మినార్ పోలీస్ స్టేషన్ డీఐగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో హెడ్ ఆఫీస్ సెంట్రల్ కాంపులైట్ సెల్ నుంచి శ్రీకాంత్ బదిలీపై రానున్నారు. గోపాలపురం ఎస్‌హెచ్‌ఓ గా ఉన్న నరేష్ వెస్ట్ జోన్ పీసీఆర్‌కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో అఫ్జల్‌గంజ్ పీఎస్‌లో డీఐగా ఉన్న మధుకుమార్ బాధ్యతలు స్వీకరించనున్నారు. గాంధీనగర్ పీఎస్ ఇన్‌స్పెక్టర్ రాజు డాగులు ఆసీఫ్‌నగర్ డీఐగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో పంజాగుట్ట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న బోస్ కిరణ్ బదిలీపై రానున్నారు. వీరంత మరో రెండు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు.

## పీసీబీలో పర్యావరణ పరిరక్షణపై పోటీలు

అమీర్‌పేట్, మే 1: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో విద్యార్థులకు డాన్స్, స్కిట్, పెయింటింగ్ పోటీలను నిర్వహిస్తున్నట్టు సంస్థ ప్రాజెక్టు ఆఫీసర్ బి.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు విద్యార్థులకు ప్రాథమిక, ఉన్నత స్థాయి విభాగాల్లో జరుగుతాయని పేర్కొన్నారు. మే 21 నుంచి 23 వరకు ఉదయం 10 గంటలకు సనత్‌నగర్‌లోని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ప్రధాన కార్యాలయ ఆవరణలోని ఆడిటోరియంలో జరుగుతాయని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ అంశాలకు సంబంధించి జరిగే పోటీల్లో పాల్గొనాలని వివరించారు. వివరాలకు 99081 79676, 91773 031270 నంబర్లలో సంప్రదించాలని కోరుతున్నారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి టీజీపీసీబీ కార్యాలయంలో జరిగే పర్యావరణ దినోత్సవ కార్యక్రమంలో బహుమతులు అందజేస్తామని వెల్లడించారు.

### వ్యక్తి అదృశ్యం

చిక్కడపల్లి, మే 1: ఓ వ్యక్తి అదృష్టమైన సంఘటన చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై నాగరాజు తెలిపిన వివరణ ప్రకారం పశ్చిమ బెంగాల్ కి చెందిన ఈ.మాణిక్ రాయ్ (50) ఆజామాబాద్ దాదుస్ స్వీట్ హౌస్ గోడౌన్ గత కొన్ని రోజుల నుంచి పనిచేస్తున్నాడు. బీడీ తెచ్చుకోవడానికి వెళ్లిన మాణిక్ రాయ్ తిరిగి రాలేదు. అతని బంధువైన మాలిక్ ఇచ్చిన ఫిర్యాదు మీదకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ సమాచార అందించాలని ఆయన కోరారు.

### ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

బాలానగర్, మే 1: ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ భవానీనగర్‌లో గురువారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష ఆదరణ లభించింది. స్థానిక వీర బ్రహ్మంగారి ఆలయంలో శ్రీ నందక ఆసుపత్రి వారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని స్థానిక కార్పొరేటర్ ముద్దం నరసింహయాదవ్ ప్రారంభించారు. పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి అనంతరం అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రవీణ్‌కుమార్, డాక్టర్ దీప రేఖ, భార్గవి, మనీషాచారి, రామలింగాచారి, సాయిలు, సుందర్, అశోక్, చందుయాదవ్ పాల్గొన్నారు.